ప్రభువెక్కిన పల్లకీ

ఉదయం తొమ్మిది గంటలైంది కాని పల్లకీ యింకా రాలేదు.

"చూశారా పంతులుగారూ, యీ పల్లకీవాళ్లెంత దగాచేశారో! పొద్దుట ఎనిమిదో గంటకల్లా వస్తామని చెప్పిన వాళ్ళీసరికి రాలేదు. ఒట్టి దొంగ వెధవలుసుమండీ" అన్నారు గణపతిరాజుగారు.

"చిత్తం, చిత్తం. తమతో నే నింతకుముందే మనవి చేసేను. ఈ వెధవల్ని నమ్ముకుంటే మనల్ని గంగలో దింపుతారు"

"అందుకే నేను మొదట కారు తెప్పిద్దామన్నాను. మీరు పల్లకీ, పల్లకీ అన్నారు. చివరికి వెధవలు ఇలా దగాచేశారు"

"తమకి కోపంవస్తే నే చెప్పలేనుకానీ, ఎంతేనా పల్లకీ పల్లకీయే, కారు కారే. నే పౌరోహిత్యంచేసిన పాతికేళ్లలోనూ కొన్ని వందలపెళ్ళిళ్లు చేయించేను. ఇంక మసింట్లో ఓ డజను పెళ్ళిళ్లు చేయించేను. నాకు తెలీదంటారా? పల్లకీదర్జా వెధవ కారుకి ఎలావస్తుంది చెప్పండి? అయితే ఈ వెధవలు దగా చెయ్యాలంటే కారువాడు చెయ్యలేడా? అసలు కారే దగా చెయ్యవచ్చును. తీరా తీసుకొచ్చాక నడవకపోతే దాన్నిక మనమందరము తొయ్యాలి. వాళ్ళు వస్తూవుంటారు యీ పాటికి. పాపం దార్లో ఏ మాటంకమొచ్చిందో ఏమిటో?"

"ఏం రావడమో, వెధవలు; పోనీ ముందరే ఏడవరాదూ, ఇన్ని గంటలకుగాని రాలేమని. రానీండి వెధవల్ని చెప్పుదెబ్బలు కొట్టిస్తాను" అని గణపతిరాజుగారు కళ్లెర్రచేశారు.

"ఎందుకేనా మంచిది. ఓ అరగంట చూసి అప్పటికీ రాకపోతే మరొక రెండెడ్లబండి తెప్పించండి. వర్జంరాకముందే బయలుదేరాలి" అన్నారు సిద్ధాంతిగారు ముక్కుపొడుం ఎగపీలుస్తూ.

"వర్జం ఎన్నిగంటలనుండి ఎన్నిగంటలవరకూ వుంటుందన్నారూ?"

"ఉదయం 10–2 నిముషాలకు ప్రవేశించి మధ్యాహ్నం 2–40 నిముషాలవరకూ ఉంటుంది. కాబట్టి పదిలోగానే బయలుదేరాలి" అంటూ శాస్త్రిల్లవారు ముక్కుపొడుం పట్టుతీసి, లోగిట్లోకెళ్ళి అందర్నీ హెచ్చరించేరు. పెళ్ళిలో పురోహితుడికి చోరవయిస్తే [ఇవ్వకపోయినా సాధారణంగా తీసుకుంటాడు] అందరినీ చంపుకుతింటాడు; ఏదో పురమాయిస్తూనే వుంటాడు.

అసలు సంగతేమిటంటే గణపతిరాజుగారు ముచ్చటగా మూడోపెళ్లి చేసుకుంటున్నారు. ఈ పనికి బంధుమిత్రులంతా సంతోషించేరు పెళ్ళికూతురుతప్ప. రెండువందల ఎకరాల పల్లం, నూరెకరాలపెట్టుతోటా దొడ్డీ వున్నాయి. ఆయనంటే మహారాజు, ఎన్ని పెళ్లిళ్లేనా చేసుకోగలరు.

రాజుగారి పెళ్లినాటి ఉదయం లోగిలి కలకలలాడుతూంది. వీధిలో పెద్ద పందిళ్లువేశారు; తోరణాలు కట్టేరు; అరటిచెట్లూ కొబ్బరాకులూ తెచ్చి కట్టేరు. ఆ వొచ్చిన మం

గలి వీరిగాడి తకోరామేళం, పట్నంనుంచి బేండు మేళం వచ్చాయి. బంధువర్గాలు, మిత్రులు, పురోహితులు, వైదిక బ్రాహ్మణులతో పందిరి శోభాయమానంగా వుంది. లోగిట్లోంచి కిలకిలమని స్త్రీల నవ్వులు వినవస్తున్నాయి. భజంత్రీలు మోగుతున్నాయి. పందిట్లో ఒకమూల రాజుగారి మేనమామ గారు తన పాండిత్యం ప్రదర్శిస్తున్నారు. మేనమామగారు కవి. సంస్కృతకావ్యాలు క్షుణ్ణంగా చదువుకున్నారు. తెల్లగా వొడ్డు, పొడుగూ గంభీరమైన ఆకారం. గిరజాలజుత్తు, చక్కటి మీసాలు, సిల్కువోణీ ఆస్థానకవిలా కనిపిస్తారు. అందుచేత ఆయన్ని కవిరాజుగారంటారు. ఆయన పందిట్లో నలుగురు శ్రోతల్ని చేరదీసి తన కవిత్వం వినిపిస్తున్నారు. మొగపెళ్లి వారంతా అక్కడికి మూడుమైళ్లదూరంలో వున్న గ్రామానికి ప్రయాణం అవుతున్నారు. సాయంత్రం 6-40 గంటలకు ముహూర్తం నిశ్చయించారు. పెద్దలు వర్జం రాకముందే బయలుదేరి ఆడపెళ్ళివారింటికి తరలివెళ్లడం మంచిదని పురోహితులు నిర్దేశించేరు.

రాజుగారికి తలంటి నీళ్ళుపోసి, పసుపురాసి పెళ్లికొడుకుని చేశారు. పెళ్లికుమారుడు మొహం కలకలలాడుతూ వుంది. కిట్టనివాళ్ళు ఏవో మాటలంటూరు గానీ, ఆయన మొహంలో మూడవ పెళ్లివాడి లక్షణాలు లేవు. వయసు నలభై అయిదేళ్ళు పైబడినప్పటికీ వయసుముదిరిన లక్షణాలు ఎక్కడా కనబడవు.

అంతేకాదు కవీశ్వరుడైన మేనమామగారు గణపతి రాజుగారిని నలచక్రవర్తితో పోల్చేరు. 'ధూర్జటిజటా కిరీ

టాలంకారంబైన శశాంకుని సౌకుమార్యంబునూ, అమృత మున కుత్పత్తిస్థానమైన పయోనిధానంబు గాంభీర్యంబును, విశ్వవిశ్వంభరాం భోజ కర్ణికాయమానంబగు సువర్ణాహార్యంబు స్థైర్యంబును' యీవిధంగా నలమహారాజులో గల లక్షణాలన్నీ గణపతిరాజుగారిలో వున్నాయని కవిరాజుగారు శ్రోతలతో అన్నారు. వారిచే బలవంతంగా వొప్పించేరు.

అసలువిషయానికి వద్దాం. ఇక్కడికి పదిమైళ్ళ దూరం లోగల పట్నం వెళ్ళి పెళ్లికి పల్లకి బేరమాడివచ్చారు. పట్నంలో నాగాశపు రంగయ్యదగ్గర చాల పల్లకీలున్నాయి. అతను పల్లకీ అద్దె పుచ్చుకుని బోయీలను కుదిర్చేడు. ఎనిమిదో గంటకల్లా పల్లకీ పంపిస్తానని వాగ్దానంచేశాడు. కాని పల్లకీ యింకా రాలేదు.

అందుచేత రాజుగారు కోపంతో చిందులుతొక్కు తున్నారు. కోపంతో చేతిలో గాజుగ్లాసు విసిరేశారు. నీళ్ల కూజా బద్దలుకొట్టేరు. బూతులుతిడుతూ బోయీలమీద కోపం బంట్రోతులమీద చూపించారు.

పావుతక్కువ పదిగంటలైంది. పూసిన రెండెడ్లబళ్లు వీధిలో కొచ్చి నిలబడ్డాయి. అందరూ సామాన్లుకడుతూ ప్రయాణానికి సిద్ధమవుతున్నారు.

రాజుగారు జరీ కండువా వేసుకొని, అద్దంముందు కొచ్చి మీసం మెలివేశారు. తలమీద ఒకటి రెండు నెరసిన వెంట్రు కలుంటే తీసిపారేశారు తన స్వరూపం పెళ్లికూతుర్ని ఆకర్షి స్తుందని తృప్తిపడ్డారు.

ఇంతట్లో పల్లకీ వచ్చిందంటే పల్లకీ వచ్చిందన్నారు.

ఇంటి దురుగా వున్న పెద్ద మర్రిచెట్టునీడలో పల్లకీ దించేరు బోయీలు. గుడ్డపాతలతో చమట తుడుచుకుని చెట్టుకిందకూర్చోబడ్డారు.

పురోహితుడు వీధిలోకి హడావిడిగా వచ్చి, "ఏమర్రా వెధవల్లారా, కూచోబడ్డా రేమిటి, వేళయింది, లెండిలెండి" అని హెచ్చరించాడు.

బోయీలందరూ మంచి బలిష్టులే కాని పదిమైళ్లు నడిచీ సరికి పూర్తిగా అలసిపోయారు. అందులోకీ వేసవికాలం. ప్రొద్దుటే ఎండ చుర్రున తగులుతూంది. ఆరుగురు పల్లకీ మోస్తారు; మధ్యమధ్య అలసినవాళ్ళకి సాయం చెయ్యడానికి యిద్దరు అదనంగా వున్నారు. వాళ్లలో యిద్దరు యువకులు, ముగ్గురు మధ్యవయస్కులు, ఒకడు కొంచెం కాలం మల్లినవాడు. యువకులైన చిన్నిగాడూ సీతిగాడూ చాల చురుకైనవారు. చిన్నిగాడు మంచి బలిష్టుడు. నల్లటిశరీరం కండలుదేరి నిగనిగలాడుతూంది. బరువైన పల్లకీకొమ్ము భుజాని కెత్తుకోగానే వాడి వీపుమీద కండలు వెదురుకర్రల్లా పెళపెళ విరిగినట్లు కనిపిస్తాయి.

"ఏరా లేవరేమిటి?" అన్నాడు మళ్ళీ పురోహితుడు. అవునుమరి! ఆయనతొందర రాయనది. వర్షంరాకుండా బయలుదేరాలాయెను.

"ఇదిగో కసింత సల్దిగంజి తాగి ఒక సిటికెలో బయలెద్దాం బాబూ పంతులుగారూ" అన్నాడు చిన్నిగాడు.

"బాగుండర్రా ఇప్పుడు మీ భోజనానికి వేళెక్కడుంది? ఇంత ఆలస్యంగా రావడమే కాకుండా యిక్కడ చల్ది

గంజీ వ్యవహారంకూడానా? ఏం యింటిదగ్గర తాగి రాలేక పోయారూ?'' అన్నాడు పురోహితుడు.

"అదేమిటి బుగతగారూ అలాగంటారు. ఆ రంగయ్యబాబింటికి పెందలకడ ఎత్తే గంట కూకోబెట్టి పల్లకీ ఇచ్చినాడు. సల్దికూడూ, బత్తేలు రాజుగారింట్లోనే నన్నాడు. ఈకాడికి వచ్చిమంచినీళ్లు నోట్లో ఏసుకోలేదు బాబు, సెబితే నమ్మరు గాని'' అన్నాడు చిన్నిగాడు.

"అబ్బే. అవన్నీ యిప్పుడు లాభంలేదు. పదండి ఉంటే మరొక రెండునిముషాల్లో వర్షం వస్తుంది మళ్ళీ''

"ఇదేమిటి బాబు' అయిదుకోసులు నడిసొచ్చి సల్దిగంజి నేకపోతే మరో రెండుకోసు లెల్లడం మాతరమా బాబు. మనసులమా ఎనుబోతులమా సెప్పండి''అన్నాడు చిన్నిగాడు.

"ఛీ వెధవా నోరుముయ్'' పురోహితుడికి కోపం వచ్చింది. "అదేమిటి బాబు ఎదవా ఎదవా అని తిడతారు. రాజుగారు పెల్లి సేసుకుంటే ఊరోళ్ల పెల్లాలు సచ్చిపోతారేటి? మంచోరే''

ఈ సంభాషణంతా లోపలినుండి వింటూన్న గణపతిరాజుగారు కోపంతో చిందులుతొక్కుతూ బూతులుతిడుతూ బయటికి వచ్చారు.

"లంజకొడుకుల్లారా, ఇంత ఆలస్యంగావచ్చి మళ్లి మాటాడ్డం కూడానా? మీ బుర్రతిరుగుడు వొదలగొడతా నుండండి!'' అన్నారు రాజుగారు.

చిన్నిగాడు ఏదో అనబోయాడు. బోయిలలో ముసలివాడైన వెంకడు ముందుకొచ్చి వాడిని కొంచెం వెనక్కినెట్టేడు.

“ఓ రుండ్రా సిన్నిగా, పెద్దా సిన్నా లేకుండా ఏటా వోగుడు. బాబు ఏలినోరికి కోపమొస్తే మేం చెప్పలేం కానీ, యిందులో మా తప్పేటి లేదు బాబు” అన్నాడు ముసలి వెంకడు.

“ఛీ, వెధవా యింకా తప్పలేదంటావాం ?” అన్నారు రాజుగారు.

“ఆలకించండి బాబు దద్దయ్యగోరూ, మాము నాగారపు రంగయ్యబాబింటికి పెందలకడే ఎల్లినాం బాబు. ఆడి పల్లకీలన్నీ పెల్లిల్ల కెల్లిపోనాయి బాబు. సిరిపురంనుండి పల్లకీ వొచ్చిందాక మమ్మల్ని కూకోబెట్టి, అప్పుడిచ్చినాడు. సల్ది గంజేనా తాక్కుండా పల్లకీ పట్టుకొచ్చినాం బాబు”అన్నాడు వెంకడు.

“వెధవల్లారా. ఆలస్యమైందికాక, బయల్దేరమంటే ఆయనతో వాదనా, మీదుమిక్కిలి! నా తడాఖా తెలీదుకాబోలు చర్మం వొలిపిస్తాను తెలుసా” అని రాజుగారు బూతులికి లంఘించుకున్నారు.

చిన్నిగాడికి వొల్లుమండింది. ముసలి వెంకణ్ని వెనక్కి తోసి, “వోదనేటి బాబూ, సల్దిగంజి తాగినాక పల్లకీ ఎత్తుతా మన్నాంగాని” అన్నాడు.

“ఛీ లంజకొడకా, నోరుముయ్యి” అన్నారు రాజుగారు.

“అదేటి తిడతారేటి బాబూ. మంచోరే” అన్నాడు చిన్నిగాడు చిరాగ్గా. రాజుగారికి కోపంతో ఆవేశమొచ్చింది. ఇరవై ఏల్లుగా తను ఊళ్లో చాకళ్లనీ, మంగళ్ళనీ, పాలేర్లనీ నిరాఘాటంగా తిడుతున్నాడు. ఇప్పుడంటే ఊళ్ళో చాకలి వెధవలు, మంగలి వెధవలు సమంగా మాట వినకుండాపో

యారుగాని, తన తండ్రిగారు బతికివున్నప్పుడు తాను మంచి యవ్వనంలో ఉన్నప్పుడు (ఇప్పుడు లేరనికాదు) తన పేరుచెబితే ఊళ్ళో పశువులు నీళ్లు తాగేవికావు. తన్నలా తయారుచేశారు తండ్రిగారు. తను ఊళ్ళో ఇష్టమొచ్చినవాళ్లని తిట్టేవాడు, కొట్టేవాడు, ఇష్టమొచ్చిన ఆడదాన్ని జబ్బపట్టుకుని లాగేవాడు. అలాంటిది యీనాడీ పల్లకీమోసుకునే చాకలి వెధవలు తిట్టడానికికూడా తనకి హక్కు లేదనేవాళ్లేనా? తన పౌరసత్వపుహక్కు నెవరో ఛాలెంజీ చేసినట్లనిపించింది రాజుగారికి. ఆయన కోపంతో వొళ్లుమరచిపోయాడు,

"లంజాకొడకా తిడతాను, కొడతానుకూడాను. నా సంగతి నీకు తెలిదురా. ఎముకలు విరగ్గొడతాను వెధవా" అని చిన్నిగాడిచేతిలో కర్రలాక్కుని ఒక్కటివేశారు. అయితే యీ దెబ్బలన్నిటికి అడ్డుపడిన ముసలివెంకడినుదుటికి తగిలిందా దెబ్బ. వాడి నుదురుమీద నెత్తురుచిమ్మింది. వాడు సొమ్మసిల్లి నేలపడిపోయాడు. చిన్నిగాడుకూడా కలియబడ్డాడుగాని తక్కిన,బోయీలూ, వాళ్లూ విడతీశారు. రాజుగారు బోయీలు దెబ్బలాడుకోవడంచూసి చాల జనంమూగేరు. చిన్నిగాడు చెప్పరాని బూతులుతిట్టేడు. బంధువులూ, స్నేహితులూ వచ్చి రాజుగారిని పీధిసావిట్లోకి తీసుకువెళ్ళేరు.

ముసిలివెంకడి నుదుటికి గుడ్డకట్టి నీళ్లుజల్లేరు. వాడికి తెలివివచ్చింది కాని చాల బాధపడుతున్నాడు; చిన్నిగాడికి వెర్రికోపమొచ్చింది.

"నెగంద్రా, ఎత్తండి పల్లకీ, పదండి పోదాం. ఈ నా కొడుకుని పల్లకీమోసేకంటే సచ్చిన ఎనుబోతుని మొయ్యడం

నయం నన్నొగ్గవలసిందిరా, నాకొడుకుని పందిని బాదినట్టుబాది సంపేద్దును, రాచోడైతే అయినాడుగాని''

బోయీలు భయపడిపోయారు. చిన్నిగాడి సాహసాన్ని కొంతమంది విమర్శించేరు. ఇంతకాలమై పల్లకీ మోస్తున్నారు కాని యిటువంటి అనుభవం వారి కెప్పుడూ కలగలేదు. అయిదారు గ్రామాలను గడగడలాడించిన రాజుగారిమీద తిరగబడడమే! మహా మహా తాసీల్దారులూ, సముద్దారులే ఆయన మాటకి ఎదురుచెప్పలేరు. రాజుగారి అనుగ్రహం లేకపోతే పొరుగూరువాడికి యీ వూళ్లో పచ్చిమంచినీళ్లయినా పుట్టేవి కావు. అలాంటిది బట్టలుతికే చాకలిచిన్నిగాడు ఆయనమీద తిరగబడటమే! ఏం విచిత్రం!

“ఒరే సిన్నిగా తొందరపడిపోనావురా; ఏదో కాళ్లూ సేతులూ వొట్టుకొని బతిమాలుకుంటే తీరిపోయేదికదా! ఛ! ఏట్రా ఆ కుర్రతనం!'' అన్నాడు రాజుగారిచేత దెబ్బలుతిన్న ముసలివెంకడు.

“ఏట్రోయ్ ఎంకన్నా, ఏటి ఎంత సాకలోళ్ళమైనా ఉప్పూ కారం తింటున్నాంకదా! ఏ నేరంనేందీ తిడితే వోల్ల కూరుకోమంటావేంటి? మంచోడివే, బయమ్మేట్రా? ఏటి పీక తీసేస్తాడేటి?''

“ఏటో ఏదైన నీది బొత్తిగ కుర్రతనంరా సిన్నిగా ఎప్పుడు రుసరుసనాడితే పనిజరుగుతాదా సెప్పు?''

“అయితే ఏట్రా నువ్వనేది? ఇన్నేళ్లొచ్చినాయి చిగ్గు నేదురా, ఛీ! మనిషిజలమ ఎత్తగానే సరా?''

“అయితే యిప్పు డేటిసెయ్యాల్నో సెప్పురా?''అన్నాడు

వెంకడు. ఏదైనా చిన్నిగాడి సలహాలేంది ఏ పనీ జరగదు చాకలాళ్ళకి.

"సల్దికూడెట్టి, ముందుగా బత్తేలూ, కూలిడబ్బులూ యిస్తే కొమ్ముకెత్తుకుంటాం బాబూ అని సెప్పేదాం. అంతా ఒకమాటమీద నిలబడాల, తెలిసిందా? ఎవడేనా ఎనకదీసినాడా నాకొడుకుని బండికేసి ఉతికేస్తాను అంతే. నాతోటి ఈ ఏసాలు సాగవురోయ్ నాయినా!" అన్నాడు సిన్నిగాడు.

సావిట్లోంచి రాజుగారు ఇదంతా విన్నారు. విని గబ గబ వీధిలోకివచ్చి 'పల్లకీ మొయ్యడానికివచ్చి షరతులుపెడ తావురా! లంజాకొడకా! ఒక్క దమ్మిడీ యివ్వను; పల్లకీ తీసు కుని ఊరుదాటి ఎలా వెళ్తావో చూస్తాను' అన్నారు. అలా అని ఊరుకోలేదు. ఊళ్ళో చాకలాళ్ళని పిలిపించి పల్లకీ ఎత్తమన్నారు.

'ఒరే సెప్తతున్నాను ఇనుకోండిరా, ఏ సాకలి నంజ కొడుకేనా కొమ్మట్టుకున్నాడా సీరేస్తాను, ఎరికా? సాకలిసిన్ని తడాఖా మీకే ఎరిక! అంతేకాదురా నాయనా రేపు రోడ్డెక్కి నడవనేరురా బాబూ, జాగరత' పట్నంచిన్నిగాడి కీర్తి ఊళ్ళో చాకలాళ్ళకితెలుసు. పట్నంలో చాకలాళ్ళ సంఘానికి వీడుపెద్ద. వాళ్లు మీటింగులుచేస్తారు. మీటింగు వున్ననాడు చిన్నిగాడు లాల్చీ తొడిగి, పంచకట్టి, పెద్దపాగా చుట్టి, మీసం మెలివేసి, చేపాటికర్రపట్టుకుని నాయుడిలా తయారవుతాడు. చాల హడావుడిచేస్తాడు. చాకలాళ్ళంతా ఒక కట్టుమీద వుంటారు. ఆంచేత వాళ్లు నాలుగుడబ్బులు చేసుకుంటున్నారు. కాని ఈవూరు చాకలాల్లకి సంఘంపెట్టే

ధైర్యం లేదు. కాని రాజుగారిని ఏమంత లక్ష్యపెట్టడం మానీశారు. అందుచేత అప్పుడు పల్లకీమోసే అలవాటు మాకు లేదన్నారు. అలవాటు లేనివాళ్లు పల్లకీమోస్తే దారిలో ఎత్తేసినా ఎత్తేస్తారు. అందుచేత రాజుగారు వాళ్లని నాలుగు బూతులు తిట్టి పొమ్మన్నారు.

"ఒరే ముసిలోడా, వొళ్లక పల్లకీలో తొంగోరా మొగం తిరిగిపోగలదు" అంటూ చిన్నిగాడు వెంకణ్ణి పల్లకీలో పడుకోబెట్టేడు.

"దొంగలంజాకొడుకులు! ఎంత పొగరు!" అంటూ రాజుగారు చాకళ్లని ఊరు బయటకు రాగానే చావచితకతన్నమని ముందుగా పాలేర్లని పంపించేరు. రాజుగారిది గొప్ప దూర దృష్టి కాని పాలేర్లు జడిసిపోయారు. ఆపనిచేస్తే రేపు పట్నం వెళ్లినప్పుడు చాకలాళ్లు వూరుకుంటారా? కొట్టి చంపేస్తారు.

"ఒరే వీర్రాజూ, పోలీసువాళ్లని పిలిపించి యీ వెధవల నందరినీ కొట్లో తోయించరా. ఆ ములుగు కాస్తా కట్టిపోతుంది" అని రాజుగారు మేనల్లుడు వీర్రాజుకి ఆదేశించేరు.

"ఏమర్రా, రాజుగారి కాళ్లమీదపడి బతిమాలుకోండ్రా, కోపంగా వున్నారు" అన్నాడు వీర్రాజు.

"నెగండ్రా. ఎత్తుకోండిరా కొమ్ము. పల్లకీలో వొళ్లక తొంగోరా ఎంకా" అని చిన్నిగాడు పల్లకీకొమ్ము ఎత్తేడు.

ముసలి వెంకణ్ని పల్లకీలో వేసుకొని పల్లకీ తీసుకొని వెళ్లిపోయారు బోయీలు. రాజుగారి పెళ్లి ముహూర్తం తప్పిపోయింది.

—o—